# మన నేషనలిస్ట్ వాయిస్

RNI : TGTEL/25/A4284

తెలుగు దిన పత్రిక

www.manannationalistvoice.com    epaper.manannationalistvoice.com

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 126 | 02 గురువారం, ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం



రిపోర్టర్లు కావలెను

మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9666023180.8096660656 నంబర్లకు

వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.




మంత్రి పొంగులేటి అక్రమాలపై

## హౌజ్ కమిటీ కోరాం

- సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు
- కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం
- ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్1( నేషనలిస్ట్ వాయిస్):** రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..

...మిగతా 2 లో...

ఎన్నికల నియమావళి

# ఉల్లంఘన...

## టీవీకే అధినేత విజయ్‌పై ఈసీ కేసు



ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్‌పై ఎన్నికల సంఘం కేసు నమోదు చేసింది. ఒక బహిరంగసభలో ఎన్నికల నిబంధనలను అతిక్ర మించారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెరవల్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఈకేసు నమోదైంది. బీఎన్ఎస్ 2023, 126(2), బీఎన్ఎస్ సెక్షన్ 189 (2), 223 బీఎన్ఎస్ 3(ఏ) మరియు 3(5) ల కింద పెరవల్లూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తమిళనాడులో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే. అధికారుల అనుమతి లేకుండా సభలో ఏకంగా 30 లౌడ్ స్పీకర్లు ఉపయోగించారని, అలాగే 5,000 మందికి మించి ప్రజలు సభకు హాజరయ్యారని, దీనితో ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఆరోపిస్తూ ఈసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.అలాగే, రోడ్లు బ్లాక్ చేయడం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాల్ని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విజయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. విజయ్‌తోపాటు సభకు హాజరైన పార్టీ కార్యకర్తల్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు:

# కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి



కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు.కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఓటు బ్యాంకును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.

అమరావతి చట్టబద్ధత బిల్లుకు

# తెలంగాణ బీజేపీ మద్దతు



అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు.దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరఫున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.



రెండు పంచాయితీలకు

## వికాస్ పురస్కారాలు

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

**న్యూఢిల్లీ,ఏప్రిల్1( నేషనలిస్ట్ వాయిస్):** గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది.

...మిగతా 2 లో...



ఇరాన్‌లో సైనిక చర్యల ముగింపుపై

# ట్రంప్ కీలక ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక ప్రకటన చేశారు. మరో రెండు, మూడు వారాల్లో ఇరాన్‌లోని అమెరికా సైనిక కార్యకలాపాలను ముగి స్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ అధికారులతో చర్చలు కొనసాగిస్తూనే వైమానిక దాడులను కొనసాగిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. మంగళవారం వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి పెరిగిన ఇంధన ధరల ప్రభావం గురించి విలేకరులు ప్రశ్నించగా... "మేం ఇరాన్‌ను వీడితే చాలు, ధరలు అవే పడిపోతాయి. ఆ పని మేం త్వరలోనే చేయబోతున్నాం. మరో రెండు వారాల్లో, లేదా కొన్ని రోజులు అటూఇటూగా ఈ పని పూర్తవుతుందని భావిస్తున్నా"


...మిగతా 2 లో...

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు..

### నిర్దోషిగా తేల్చడాన్ని సవాలు చేసిన ఈడీ



ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన హాజరుకా కపోవడంతో దాఖలైన కేసుల్లో ట్రయల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది.



## పసిడి పరుగు... లక్షన్నర దాటిన ధర

బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. వరుసగా మూడో రోజు కూడా వాటి జోరు కొనసాగింది. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 1,51,500కి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. మరోవైపు కిలో వెండి ధర కూడా రూ. 5,000 పెరిగి రూ. 2,37,000కి ఎగబాకింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో కొనుగోళ్ల ఆసక్తి పెరగడం ధరల పెరుగుదలకు దోహదపడింది.ఇరాన్‌తో యుద్ధం రెండు, మూడు వారాల్లోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అంతర్జాతీయంగా పసిడి ధరలు బలపడ్డాయి. ఆసియా ట్రేడింగ్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 1.25 శాతం పెరిగి 4,737 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయనే అంచనాలు కూడా ధరలకు మద్దతునిచ్చాయి. దేశవ్యాప్తంగా సగటున 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,250 మేర పెరిగింది.ప్రస్తుతం ఒక గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ. 14,827 పలుకుతుండగా, ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు రూ. 13,591గా ఉంది. ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం సోమవారం నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. 1,46,733గా ఉంది. మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం మార్కెట్లకు సెలవు కావడంతో అవే ధరలు కొనసాగాయి. అయితే, ఈ తాజా పెరుగుదలకు ముందు మార్చి నెలలో బంగారం ధరలు భారీగా పతనమయ్యాయి.



ఇంధన ధరల పెరుగుదల, వడ్డీ రేట్ల కోతపై అనిశ్చితి వంటి కారణాలతో గత 17 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా మార్చిలో పసిడి విలువ దాదాపు 15 శాతం క్షీణించింది. కనిష్ఠ స్థాయుల వద్ద పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ప్రస్తుతం ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.


# కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు...

మొదటిపేజీ తరువాయి

ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈడీ తరఫున న్యాయవాది జొహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినా, ఆయన తరఫున ఎవరూ హాజరుకాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించడం ద్వారా ట్రయల్ కోర్టు తీవ్రమైన తప్పిదం చేసిందని వాదించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జారీ చేసిన సమన్లు ఆయనకు అందినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం, కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది. అలాగే, ట్రయల్ కోర్టు రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. గతంలో పీఎంఎల్ఏ సెక్షన్ 50 కింద ఈడీ జారీ చేసిన ఐదు సమన్లను కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఈడీ రౌస్ అవెన్యూ కోర్టులో ఫిర్యాదు చేసింది. అయితే, ఈ ఫిర్యాదులను విచారించిన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పరాస్ దలాల్, కేజ్రీవాల్‌పై విచారణ కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. ఈ తీర్పునే ఇప్పుడు ఈడీ హైకోర్టులో సవాలు చేసింది. ఇదే సమయంలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా హైకోర్టులో విచారణలో ఉంది. ఈ కేసు విచారణను జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం నుంచి మరో బెంచ్‌కు బదిలీ చేయాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించడం గమనార్హం. విచారణ నిష్పాక్షికతపై తనకు సహేతుకమైన అనుమానాలు ఉన్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఇద్దరికీ చూపు ప్రసాదించిన బ్యాంకు మాజీ ఉద్యోగి

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1-**



కమాన్ పూర్ మండల కేంద్రం చెందిన జంగేపల్లి మల్లయ్యఏబ్యాంకు మల్లయ్య మరణాంతరం కుటుంబ సభ్యులు ఆయన కళ్ళను కమాన్ పూర్ లైన్స్ క్లబ్ వారికి అందజేశారు. కమన్ పూర్ లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ పెద్దపల్లి జిల్లా కమన్ పూర్ మండల కేంద్రంలో నివసించే జంగపల్లి మల్లయ్య (75)మాజీ బ్యాంకు ఉద్యోగి బుధవారం అనారోగ్యం తో మృతిచెందారు. ఇంటి పెద్ద మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇలాంటి దుఃఖ సమయంలో కూడా మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన కుటుంబం. నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని, మల్లయ్య కళ్ళు సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయని కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కోశాధికారి డా విజయకుమార్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతోభార్య జంగాపల్లి లక్ష్మి కుమారులు సత్య నారాయణ,విజయ్ కుమార్ కుమార్తెలు వెంకట్ లక్ష్మి- అల్లుడు పోతరాజు సమ్మయ్య మనవళ్లు మనవరాలు రవళి,యశ్వంత్ సాయి, రిషిత, ప్రియతమ్ అంగీకరించారు. బుధవారం సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి,కమన్పూర్ మండల అధ్యక్షులు నర్సింహా చారీ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణరెడ్డి కార్యదర్శి నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుని నేత్రాలను సేకరించారు. అనంతరం వాటిని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా నేత్రదాత కుటుంబ సభ్యులను కమన్పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు సతీష్, శ్రీను అభినందించారు. పార్థివదేహం వద్ద మౌనం పాటించి నేత్రదాతకు నివాళులర్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, క నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, వెల్ది కవిత అనంతరాములు, కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కొనియాడారు. నేత్రదానం కార్యక్రమంలో పలుపెద్దపల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



# బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించిన ఆర్.జి-త్రీ, జి.యం

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1.**



2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-3 ఏరియా సాధించిన బొగ్గు ఉత్పత్తి,రవాణా వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 65.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 49.40 లక్షల టన్నులు అనగా 76 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, నిర్దేశించిన 400.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి (మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను 67 శాతం అనగా 266.30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికి తీయడం జరిగిందన్నారు. అలాగే 2025 -26 ఆర్థిక సంవత్సరంలో 65.38 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందన్నారు. మార్చి నెలకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 6.20 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 4.81 లక్షల టన్నులు అనగా 78 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, నిర్దేశించిన 37.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను, 31.18 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 84 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, అదేవిధంగా 6.44 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ మార్చి నెలలో ఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 3.20 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.33 లక్షల టన్నులు అనగా 42 శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 3.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3.48 లక్షల టన్నులు అనగా 116 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం, అలాగే మార్చి నెల కంపెనీ షావెల్స్ కు నిర్దేశించిన 13.00 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 14.48 లక్షల క్యూబిక్ మీటర్ల సాధించి 111 శాతం లో నిలవడం జరిగిందన్నారు.గనుల వారిగా ఓ.సి.పి-1 కు 5.50 లక్షల క్యూబిక్ మీటర్లలకు గాను 6.23 లక్షల క్యూబిక్ మీటర్లు సాధించి 113 శాతం నిలిచిందని, ఓసిపి-2 కు 7.50 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 8.25 లక్షల క్యూబిక్ మీటర్లు సాధించి 110 శాతం లో నిలవడం జరిగిందన్నారు.ఇందుకు కృషి చేసిన అధికారులకు, ఉద్యోగులకు, కార్మిక సంఘ నాయకులకు అభినందనలు తెలియజేశారు. భవిషత్తులో కూడా ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి కృషి చేయాలని, ఉపరితల గనులలో వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తు చ తప్పక పాటించాలని అన్నారు.

# రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి.

## ఏ పి ఏ జిఎం కొలిపాక నాగేశ్వరరావు.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1.**



సింగరేణి సంస్థలో ప్రతి కార్మికుడు రక్షణతో కూడిన ఒగ్గు ఉత్పత్తి సాధించాలి అని ఆర్జీ 3 ఏరియాలోని అడ్డాల లాంగ్ వాల్ ప్రాజెక్టు జిఎం కొలిపాక నాగేశ్వరావు అన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ కొలిపాక నాగేశ్వర రావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కు 15.50 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.72 లక్షల టన్నులు అనగా 11 శాతం ఉత్పత్తి తో పాటు 40,062 వేల టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందన్నారు. అలాగే మార్చి నెలలో నిర్దేశించిన 1.65 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.15 లక్షల టన్నులు అనగా 9 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, 5,212 వేల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. త్వరలోనే నూతన లాంగ్ వాల్ ప్యానల్ పనులను పూర్తి చేస్తామని, సింగరేణి సంస్థ ఈ నూతన ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధిస్తామని, అందుకు అడ్రియాల లాంగ్ వాల్ ఉద్యోగులందరూ సహకరించాలని కోరారు.

# ఆర్పీలు అవినీతికి పాల్పడితే సహించేది లేదు

## ముస్సిపల్ కమిషనర్ అయాజ్, చైర్మెన్ మొలుగు దిలీప్..

**జమ్మికుంట, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అర్పిలు అవినీతికి పాల్పడితే సహించేది లేదని మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, లు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అర్పిలతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్, అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్ టూ డోర్ చెత్త సేకరణ, మున్సిపల్ అభివృద్ధిలో అర్పిల పాత్ర చాలా కీలకమైనదన్నారు. అర్పిలు సంఘాలకు బ్యాంక్ నుండి లోన్ ఇప్పించడం బాధ్యత అని వారు అన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సంఘ సభ్యులు లోన్ ఇచ్చే ముందు డబ్బులు అడుగుతున్నారని మా దృష్టికి గానీ, ఏసీబీ అధికారులకు గానీ సమాచారం నేరుగా ఇవ్వవచ్చు అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, మెప్మా ఇంచార్జి టి.ఏం.సి మల్లీశ్వరి, సి.ఎల్.అర్పిలు, అర్పిలు, సమాఖ్య ఓబీలు పలువురు పాల్గొన్నారు..





# ఎండ తీవ్రతకు మానేరులో ఎండిపోయిన మంచినీటి బావి..

## నీరు లేక గండ్రపల్లి గ్రామ ప్రజలు ఇక్కట్లు..

**జమ్మికుంట, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1**

జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామంలో గత మూడు రోజుల నుండి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వలన మానేరులో గల మంచినీటి బావి ఎండిపోవడం వలన భగీరథ నీరు గంద్రపల్లి గ్రామానికి గత మూడు రోజులుగా మంచినీరు రావడం లేదు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్ వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన మానేరులో కొత్తగా బోరు వేసి ఎండిపోయిన పాత బావిలోకి నీటిని అందించి గ్రామ ప్రజల సౌకర్యార్థం నీటి ఎద్దడిని తీర్చారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్ మరియు గ్రామపంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు..



# మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

మొదటిపేజీ తరువాయి

దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా సబ్జెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

# రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

మొదటిపేజీ తరువాయి

గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# ఇరాన్‌లో సైనిక చర్యల ముగింపుపై ట్రంప్ కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి

అని ఆయన బదులిచ్చారు.అయితే, అమెరికా సేనల ఉపసంహరణకు ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. "వారు నాతో ఒప్పందం చేసుకోవాల్సిన పని లేదు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయలేని స్థితికి, శిలాయుగంలోకి వెళ్లినప్పుడు మేం బయటకు వస్తాం. ఒప్పందం ఉన్నా లేకున్నా అది అసంబద్ధం" అని ఓవల్ ఆఫీస్‌లో విలేకరులతో అన్నారు.మెయిల్-ఇన్ ఓటింగ్‌లో మోసాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ దాన్ని నిరోధించడానికి ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ చమురు ట్యాంకర్ల రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే.

# పొలం పని చేస్తున్న మహిళపై చోరీకి యత్నించిన దొంగ..

## పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానిక ప్రజలు

**జమ్మికుంట, నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1..**



జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామం లో పొలం పని చేసుకుంటున్న మహిళను మంచి నీరు అడిగి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు దొంగిలించడానికి ప్రయత్నించిన గుర్తు తెలియని వ్యక్తి..వెంటనే తీరుకొని మహిళ కేకలు వేయడం తో పారిపోతున్న దొంగను స్థానిక ప్రజలు చాకచక్యంగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు ..ఆ వ్యక్తి వద్ద ఒక కత్తెర ఒక చున్ని మధ్యప్రదేశ్ కు చెందిన ఆధార్ కార్డు లభించింది.విచారిస్తున్న పోలీసులు.

# బాధ్యతగా పనిచేయడమే లక్ష్యం

-సమస్యల పరిష్కారంలో ముందుంటాం

-నూతన సభ్యుల హామీ-రైస్ మిల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు బుధవారం స్థానిక జిల్లా కేంద్రంలోని సూర్య ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికలు అసోసియేషన్ సభ్యుల సమక్షంలో స్నేహపూర్వక వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏకగ్రీవ నిర్ణయాలతో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది. ఈ ఎన్నికల ద్వారా రాబోయే మూడు సంవత్సరాల కాలానికి(ఏప్రిల్ 1-42026 నుండి మార్చి 31, 2029 వరకు) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన కమిటీ ఇలా...అధ్యక్షులుగా జుగల్ కిషోర్ ఖండెల్వాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శిగా ఏలిపిద్ది శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా పల్లపోతు శ్రీనివాసు(వాసు)ఎన్నిక కాగా ఇతర కార్యవర్గ సభ్యులను కూడా సభ్యుల సమ్మతితో నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లా రైస్ మిల్ పరిశ్రమ అభివృద్ధి సభ్యుల సంక్షేమం సమస్యల పరిష్కారం సమగ్ర పురోగతికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. సభ్యులందరూ కొత్త కమిటీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.



# బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కిరణ్ కుమార్ ముదలక్కర్ బాధ్యతల స్వీకరణ







**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

ఇటీవల జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 30ఓట్ల మెజారిటీతో గెలుపొందిన పాల్వంచ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కిరణ్ కుమార్ ముదలక్కర్ బుధవారం జిల్లా కోర్టు లైబ్రరీ హాల్ నందు ఎన్నికల అధికారి పలివెల గణేష్ బాబు నుండి భాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులకు అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అందరిని సమన్వయం చేసుకుంటూ న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రణాళిక బద్దంగా పనిచేస్తానని నూతన జిల్లా కోర్ట్ భవన నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన బార్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 2026-27 సంవత్సరానికి అధ్యక్షుడిగా, ప్యానెల్ లో గెలుపొందిన వివిధ హోదాల్లోని సభ్యులు తమ పదవులకు వన్నె తెచ్చేలా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కిరణ్ కుమార్ తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు కాటూరి సంజీవ్ రావు, శషాజన్ పర్వీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడిపెల్లి మహేష్, సంయుక్త కార్యదర్శి గడదాస్ నాగరాజు, గ్రంథాలయ కార్యదర్శి దొడ్డ ప్రసాద్, కోశాధికారిగా గుళ్ళ సంధ్యరాణి క్రీడలు సంస్కృతిక విభాగం కార్యదర్శులుగా బానోత్ దేవదాస్, నకిరికంటి ఉమా, మహిళ ప్రతినిధిగా నిమ్మలురి ఉషారాణిలు నియామకపాత్రలు స్వీకరించారు. మొత్తం 10 స్థానాలకు ఎన్నికలు జరగ్గా కిరణ్ కుమార్ ప్యానెల్ నుండి పోటీచేసిన 9 మంది గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జీ.వి.కే మనోహర్, బాబురావు, ఉటుకురి పురుషోత్తం, పలివేల సాంబశివరావు, ఆర్.విజయ్ కుమార్, లక్కినేని సత్యనారాయణ, రమేష్ కుమార్ మక్కడ్, గాజుల రామ్మూర్తి, అనుబ్రోలు రాంప్రసాద్, భాగం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమకు తగ్గట్టుగా వేతనం ఇవ్వాలి

-కమిషనర్ కు కార్మికుల వినతి

నూతన కార్పొరేటర్ లు అందరూ కార్మికులకు అండగా నిలవాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ కోరారు. కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. చాలీచాలని వేతనాలు వస్తున్నాయని కార్మికుల రక్షణ కోసం ఆరోగ్యం కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ప్రతి మున్సిపల్ కార్మికులకి 22, 750 రూపాయలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం తగదని వెంటనే కార్పొరేషన్ సమావేశాల్లో తీర్మానం చేసి ప్రతి మున్సిపల్ కార్మికుడికి 22,750 రూపాయలు ప్రతి నెల వేతనం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా మున్సిపల్ నాయకురాలు అంబాల దుర్గమ్మ, కార్మికులు పుట్ట సుశీల, సరిత, లక్ష్మి, అంబాల సీత, అంబాల రాజమణి, సంజీవ్, రఫీ, హరిత, సుధా, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా..?

-పాఠశాలలో సిబ్బంది తీరుపై కలెక్టర్ అంకిత్ ఆగ్రహం





**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా అంటూ జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి కుల ధృవీకరణ ఆదాయ నివాస ధృవీకరణ రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ సేవ ద్వారా చెల్లిం చవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. భూ సమస్యలు సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై విద్యుత్ మిషన్ భగీరథ ఇరిగేషన్ వ్యవసాయం పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్ మెనూ పాటించక పోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్ ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?" అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడక పోవడం రుచి నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు భద్రతా చర్యలపై ఆరా తీసి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తూప్రాన్ నాలుగో వార్డ్‌లో నేడు ప్రజా పాలన సమావేశం

**తూప్రాన్, ఏప్రిల్ 1 (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి):**



మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డ్‌లో ప్రజా పాలన కార్యక్రమం నేడు (గురువారం) ఉదయం 9 గంటలకు రిటైర్మెంట్ కార్యాలయంలో నిర్వహించ నున్నట్లు వార్డ్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ తెలిపారు. వార్డ్‌కు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అంశాలు, సంక్షేమ పథకాల అమలు పై సమగ్ర చర్చ జరిపే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అమలులో ఉన్న సంక్షేమ పథకాలతో పాటు, జూన్ 2 నుంచి అమలు చేయనున్న కొత్త పథకాలపై కూడా వివరాలు తెలియజేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా వార్డ్‌లో పెండింగ్‌లో ఉన్న ఇంద్రమ్మ ఇళ్లు, పాత మరియు కొత్త పింఛన్ల అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినిపించుకుని పరిష్కార మార్గాలు సూచించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. కావున నాలుగో వార్డ్ ప్రజలందరూ ఈ సమావేశంలో పాల్గొని తమ సమస్యలను వెల్లడించి, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కౌన్సిలర్ జైపాల్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

# హనుమాన్ జయంతి, శోభాయాత్రకు భారీ బందోబస్తు: సిపి సాయి చైతన్య




**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిది లోని ఈ నెల 02 న హనుమాన్ జయంతి, శోభాయాత్ర, అన్నదాన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని బుధవారం నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం నిజామాబాద్ ఖమ్మం రాజన్న సిరిసిల్ల , భూపాలపల్లి,ములుగు మహబూబాబాద్ ఆసిఫాబాద్ జిల్లాల నుండి పోలీస్ సిబ్బంది మరియు టి.ఎస్.ఎస్.పి బెటాలియన్ పోలీస్ సిబ్బంది 20 స్పెషల్ పార్టీ లు బందోబస్తు నిర్వాహణ కోసం దాదాపు 1300 మందితో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలలో హన్మాన్ శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శోభాయాత్ర ప్రారంభం, చివరి వరకు దారి పోడువున సి.సి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాట్లు బైనాక్యూలర్లతో పర్యవేక్షణ, కొత్తగా ఇంటర్సెప్టర్ వాహనము, పాత నేరస్తులపై నిఘా పటిష్ట పర్చడం జరిగిందని, అన్ని చోట్ల పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా ప్రతీ ఒక్కరు అన్ని రకాల జాగ్రత్తలు వహించాలని, శోభాయాత్ర సందర్భంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, శోభాయాత్ర ప్రారంభం నుండి ప్రశాంతంగా సాగేందుకు యాత్ర నిర్వాహకులు, భక్తులు యాత్రలో పాల్గొనే ప్రజలు నిబంధనల ప్రకారం నడుచుకుంటు పోలీసులకు సహకరించాలని, శోభాయాత్రను అందరు శాంతియుతంగానే జరుపుకోవడం అందరికి శ్రేయస్సుకరమని, ఎలాంటి రూమర్లును నమ్మవద్దని, ప్రతిఒక్కరు స్నేహాభావంగా ఉండాలని తెలియజేశారు.

# నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణలో అమలు చేయొద్దు

## -కలెక్టరేట్ వద్ద బ్లాక్ డే నిరసనలో కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

ఏప్రిల్ ఒకటి నుండి దేశంలో నాలుగు లేబర్ కోడ్లను అమలుచేయాలని మోడీ ఆదేశాలు ఇవ్వడం కార్మిక వ్యతిరేకమైనదని కార్పొరేట్ల సంపద పెంపుకోసం కార్మికుల గొంతుకు ఉరితాడు బిగించడానికి సిద్ధం కావడం దుర్మార్గమైశీదని కార్మిక సంఘాల నేతలు ఎస్ ఏ.జలీల్, జే.సీతారామయ్య, కంచర్లజమలయ్య, దొడ్డా రవికుమార్, షేక్.యాకుబ్ షావలి అన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. యావత్తు కార్మిక వర్గం లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మెలను నిర్వహించి తమ వ్యతిరేకత తెలియజేసినప్పటికీ మోడీ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాల కన్నా అంబానీ, అదాని లాంటి పెట్టుబడి దారులకు సంపదలను కట్ట బెట్టటమే లక్ష్యంగా లేబర్ కోడ్లను అమలు చేయటానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్ టియుసి, ఐఎఫ్ టియు, సిఐటియు, ఎఐటియుసి, టియుసిఐ సంఘాల నాయకుల ప్రసంగించారు. ఎన్నో కార్మిక సమ్మె పోరాటాలు త్యాగాలతో సాధించి అనుభవిస్తున్న 29 కార్మికచట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దుచేసిందని నాలుగు లేబర్ కోడ్ల కార్మిక వర్గ ప్రయోజనాలకు ఎంత మాత్రం ఉపయోగపడవని తెలిపారు. కార్మిక మనుగడ హక్కులు సౌకర్యాలను సమాధిచేసే ఉద్దేశంతోనే లేబర్ కోడ్లు ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసేదిలేదని ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమశీలో ఐఎన్ టియుసి త్యాగరాజన్, కాయల నాగభూషణం, పితాంబరం, ఐఎఫ్ టియు గౌని నాగేశ్వర రావు, ఎన్.సంజీవ్, మల్లికార్జున్ రావు, సిఐటియు భూక్య రమేష్, కే.సత్య, తులసి రామ్, మధుసూదన్ రెడ్డి, సతీష్, వెంకన్న, ఎఐటియుసి ఎం.రాజు, ఎం.వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, శిరీష, పద్మ, వాణి, క్రాంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.




# శ్రమకు తగ్గట్టుగా వేతనం ఇవ్వాలి

-కమిషనర్ కు కార్మికుల వినతి

నూతన కార్పొరేటర్ లు అందరూ కార్మికులకు అండగా నిలవాలి
సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ కోరారు. కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. చాలీచాలని వేతనాలు వస్తున్నాయని కార్మికుల రక్షణ కోసం ఆరోగ్యం కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ప్రతి మున్సిపల్ కార్మికులకి 22,750 రూపాయలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం తగదని వెంటనే కార్పొరేషన్ సమావేశాల్లో తీర్మానం చేసి ప్రతి మున్సిపల్ కార్మికుడికి 22,750 రూపాయలు ప్రతి నెల వేతనం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా మున్సిపల్ నాయకురాలు అంబాల దుర్గమ్మ, కార్మికులు పుట్ట సుశీల, సరిత, లక్ష్మి, అంబాల సీత, అంబాల రాజమణి, సంజీవ్, రఫీ, హరిత, సుధా, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# "సృజనకు సాహిత్యపు వెలుగు"






**ఏప్రిల్ 1 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తెలంగాణ సరస్వత పరిషత్ మరియు శాంత వసంత ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో "కథ" అనే ప్రక్రియపై సాహిత్య కార్యశాల నిర్వహించారు.విద్యార్థుల్లో సాహిత్య సృజనాత్మకతను పెంపొందించేందుకు, వారిలోని ప్రతిభను వెలికితీయడానికి మండలంలోని వివిధ పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయకర్త తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ మరియు విషయ నిపుణుడు తదూరి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు సాహిత్యంపై మక్కువ పెంచుకొని కథలు రాయడం ద్వారా మంచి ఆలోచనలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. చిన్నప్పటి నుంచే సాహిత్యంపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్తులో మంచి గుర్తింపు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు కోమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యశాలలో నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యశాల అనంతరం విద్యార్థులతో కథలు రాయించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మిర్యాల, తాళ్ల రాంపూర్ కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులు మమత, కళ్యాణి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాళ్ల రాంపూర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ...

**ఏర్గట్ల, ఏప్రిల్ 1 నేషనలిస్ట్ వాయిస్ (ప్రతినిధి):**

ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమా దేవరెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యవసర సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌లకు లబ్ధిదారులు మరియు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ ఆడెపు గంగప్రసాద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మైండ్‌ను నియంత్రించాలి, విజయాన్ని అందుకోవాలి..

**ఏప్రిల్ 1 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్‌లో పీఎం శ్రీ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన మోటివేషనల్ కార్యక్రమంలో విద్యార్థులకు సానుకూల ఆలోచనలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వన్నెల్ సత్యకుమారి మాట్లాడుతూ సంకల్పం దృఢంగా ఉంటే ఏ పనిలో అయినా విజయం సాధించవచ్చని తెలిపారు. మైండ్‌ను మనమే నియంత్రించుకోవాలని, నెగెటివ్ ఆలోచనలను పట్టించుకోకుండా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు.గణితం వంటి క్లిష్టమైన సబ్జెక్టులను నేర్చుకోలేమని భావించకుండా, సాధించగలమనే నమ్మకం పెంపొందించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. సానుకూల దృక్పథం అలవాటు చేసుకుంటే ఫలితాలు కూడా అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరాన్ని నొక్కి చెప్పారు. పనులను వాయిదా వేయకుండా పూర్తి చేస్తే విజయం సాధ్యమని తెలిపారు.
కార్యక్రమం అనంతరం స్పీకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# ఏర్గట్లలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ...

**ఏప్రిల్ 1 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లబ్ధిదారులకు చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఆనందం సుశీలకు ఓర్సు స్రవంతికి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఖర్చు చేసిన వారు సంబంధిత బిల్లులు సమర్పిస్తే, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, స్థానిక అనుమతి పత్రాలు వంటి సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తామని చెప్పారు.
ఈ చెక్కులను మంజూరు చేయించడంలో సహకరించిన తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీ మానాల మోహన్ రెడ్డి గారికి కాంగ్రెస్ పార్టీ తరపున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేండ్ల రమేష్, ఉప సర్పంచ్ సున్నపు లక్ష్మి శ్రీనివాస్, లూనా సాయన్న, సున్నపు అంజన్న, ఎండి మునీర్, జూంగల గణేష్,రొక్కెడ సంజీవ్, ఇరపట్నం నాగేష్, దొబ్బల మహేష్, ఇరపట్నం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి చరిత్ర సృష్టించింది ఈరోజే

## -ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ భారత్ రెండో సారి గెలిచి నేటికి 15ఏళ్లు

టీమిండియా ఫ్యాన్స్ 28 ఏళ్ల కల నెరవేరింది ఈరోజే. 1983 తర్వాత 2011 ఏప్రిల్ 2వ తేదీన భారత జట్టు వన్డే వరల్డ్ కప్ గెలిచి మరోసారి చరిత్ర సృష్టించింది. ధోని మ్యాచ్ విన్నింగ్ షాట్ కొట్టగానే.. 'ఇండియా లిఫ్ట్ ది వరల్డ్ కప్ ఆఫ్టర్ 28 ఇయర్స్' అంటూ అప్పటి కామెంటేటర్ రవిశాస్త్రి చెప్పిన మాటలు ఇప్పటికీ భారత అభిమానుల చెవుల్లో ధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ మ్యాచ్లో గంభీర్ (97), ధోనీ(91) ఇన్నింగ్స్ ఇప్పటికీ మరిచిపోలేం.



# సంపాదకీయం

## ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల !

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచిం చుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావంతులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామా న్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకా శాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండదు.

# శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం

## -నేడు హనుమాన్ జన్మోత్సవం
## -అందరికీ హనుమాన్ జన్మోత్సవ శుభాకాంక్షలు

హనుమంతుని జయంతిని చైత్ర శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకుంటారు. ఈ రోజున హనుమాన్ భక్తులు రోజంతా ఉపవాసముండి, హనుమన్ చాలిసా పఠనం, రామనామ జపం చేస్తారు. హనుమంతుని జన్మవృత్తాంతం శివమహాపురాణం, రామాయణం, పరాశర సంహిత మొదలైన గ్రంథాలలో అనేకానేక గాధలతో వివరించబడి వుంది .హిందూ పురాణ కథల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను. కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్ళాడెను. వారు సంతానము కొరకు భక్తితో శివుని ఆరాధించిరి. అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండు రూపములో అంజనకొసగెను. అంజనకు జన్మించిన సుతుడే ఆంజనేయుడు. కేసరి నందనుడనీ, వాయుదేవుని అనుగ్రహముతో జన్మించినందున వాయుసుతుడనీ కూడా అంటారు. ఈ పండుగ ద్వైత సంప్రదాయము ననుసరించి మాధ్యులకు ప్రధానమైనది. వారు హనుమంతుని 'ముఖ్య ప్రాణ దేవరు' అని పిలుస్తారు. హనుమంతుని ఉపాసకులు కూడా ఈ పండుగ జరుపుకుంటారు. శ్రీరామనవమితో పాటు కొందరు ఈ జయంతి జరుపుటను కూడా ఉంది.పరాశర సంహిత అనే గ్రంథం ప్రకారం ఆంజనేయుడు వైశాఖ బహుళ దశమి, శనివారం జన్మించారని తెలిపారు. అదే రోజున కొంతమంది హనుమజ్జయంతి జరుపుకుంటారు అయితే కొన్ని ఐతిహ్యాల ప్రకారం చైత్ర పౌర్ణమి నాడు నికుంభుడు తదిరత రాక్షసులను సంహరించి హనుమంతుడు విజయం సాధించినట్లు కనిపిస్తుంది. ఈ కారణంగా ఆ రోజు హనుమద్ విజయోత్సవం చేసుకునే సంప్రదాయం కొన్ని చోట్ల ఉంది. దీన్ని ఉత్తరాదిలో హనుమజ్జయంతిగా చేసుకుంటారు

### జన్మ వృత్తాంతము:

ఒకసారి దేవలోకమందు దేవేంద్రుడు కొలువుతీరి యున్న సమయాన పుంజికస్థల అను అప్సరసకాంత బృహస్పతి వద్దకు చేరి హాస్య ప్రసంగము చేయసాగిందట, ఆమె యొక్క హావభావ వికారాలకు బృహస్పతి మిక్కిలి ఆగ్రహించి నీవు భూలోకమందు "వానరస్త్రీ" గా జన్మింతువుగాక! అని శాపము పెట్టినాడు. అంత ఆ పుంజికస్థల తన తప్పిదాన్ని మన్నించి శాపవిమొచనమీయమని పరిపరి విధముల ప్రార్ధించింది. దానికి బృహస్పతి సంతసించి నీవు భూలోకమందు "హనుమంతునికి" జన్మ ఇచ్చిన తరువాత తిరిగి దేవలోకమునకు రాగలవని అనుగ్రహించెను. ఇది కంబరామాయణ గాధలో గల వృత్తాంతము. ఆ శాపకారణంగా "పుంజికస్థల" భూలోకమందు వానరకన్యగా జన్మించి "కేసరి" అను అందమైన వానరాన్ని ప్రేమించి వివాహమాడింది. అంత ఆమె



గర్భముదాల్చి శివాంశ సంభూతుడైన "శ్రీ ఆంజనేయస్వామి" కి జన్మ ఇచ్చింది.
మనోజవం మారుతతుల్య వేగం జితేంద్రియంబుద్ధిమతాంవరిష్టం।
వాతాత్మజం వానరయూథ ముఖ్యం

**శ్రీరామ దూతం శరణం ప్రపద్యే॥**

భావము:- మనస్సుని జయించినవాడు, గాలి వేగంతో పయనించేవాడు, పంచేంద్రియాలను తన అధీనంలో ఉంచుకున్నవాడు,గొప్ప తెలివిగలిగినవాడు, వానరులలో ముఖ్యుడు, శ్రీ రామచంద్రునకు దూత అయిన హనుమంతునికి ప్రణామం చేస్తున్నాను.ఆంజనేయస్వామికి 41 రోజులు నియమంగా ఆరాధన చేయాలి. గుడి దగ్గర ఉన్న రావి చెట్టుకు "11" ప్రదక్షిణలు నిదానంగా తిరుగుతూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అంటూ స్మరించుకోవాలి. స్త్రీలు మధ్యలో విరామం ఇచ్చి తిరిగి ప్రారంభించి 41 రోజులు పూర్తి చేయవచ్చు. ప్రమిద భూమిపై పెట్టకుండా రావి ఆకు వేసి దానిపై పిండితో తయారు చేసిన దీపాన్నిపెట్టి కుంకుమ, పూలతో అలంకరించి వెలిగించాలి. ఇందులో సూచించినట్లుగా పిండితో చేసిన ప్రమిదలో కొంచం బెల్లం వేసి దానిపై వత్తి వేసి నునే పోసి పూజ చేయాల్సి ఉంటుంది.

# దోపిడి వ్యవస్థ మీద తిరుగబడ్డ వీర కెరటం సర్వాయి పాపన్న గౌడ్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.మూడున్నర శతాబ్దాల కింద ఆయనొక సంచలనం. ఆరడుగుల ఆజాను బాహుడు.మెలి వేసిన మీసం ఆయన పౌరుషం.తల పాగా చుట్టి ఒక చేతిలో విల్లంబు ధరించి పోరాటానికి సై అనే ధీరుడు.రాజ్యాధికారం కోసం పోరాడి సింహాసనం ని అధిష్టించిన బహుజన సింహం.అగ్రవర్ణ దోపిడి వ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన ధైర్య శాలి.17 వ శతాబ్ది లోనే తెలంగాణ గడ్డ మీద పోరు వి త్త నాలు నాటిన విప్లవ కారుడు.తెలంగాణ పౌరుశమును పోత పోసుకున్న గౌడ్ సాబ్ సర్వాయి పాపన్న.ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుత జనగాం జిల్లా రఘునాధ పల్లి మండలం ఖిలాశాపూర్ లో 1650 ఆగస్టు 18 న వీరు జన్మించారు.రాచరిక వ్యవస్థ నీడలో జమీందారులు,జాగీరుదారులు సాగిస్తూ వున్న అరాచకములను ప్రత్యక్షంగా చూడటంతో చిన్న తనం లోనే తిరుగుబాటు లక్షణం నరనరాన జీర్ణించుకుంది.ఎలాగయిన నిరంకుశత్వంని సమాధి చేయాలని అనుకున్నాడు.ప్రజల కోసం పోరు బాట పట్టారు.బహుజన వర్గాల కులాలను ఏకం చేసాడు.స్నేహితులయిన చాకలి సర్వన్న,మంగలి మాస న్న,కుమ్మరి గోవింద్,జక్కుల పెరుమాండ్లు,దూదెకుల పీరు అహ్మద్,మీర్ సాహెబ్ లతో గెరిల్లా సైన్యశీను తయారు చేశారు.అగ్రకుల భూస్వాములు,వ్యాపార గడీల మీద,కోటల మీద దాడి చేసారు.సంపదను బహుజన పేదలకు పంచారు.పన్నెండు మందితో ప్రారంభం అయిన పాపన్న గౌడ్ సైన్యం పన్నెండు వేలకు చేరింది.చిన్న చిన్న సంస్థానములను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరణ చేసారు.మర ఫిరంగుల నుండి అశ్వ బలం వరకు ఒక రాజ్యానికి ఉండవలసిన అన్ని రకాల సైనిక సంపత్తిని సమకూర్చారు.ఖిలాశాపూర్ లో పటిష్టమయిన కోటను కట్టించాడు.ఒక బహుజనుడు రాజ్య పాలన చేయడాన్ని అగ్ర వర్ణాలు తట్టుకోలేక పోయాయి.అగ్ర వర్ణ పెత్తందార్లుమొగల్ పాలకుల తో చేతులు కలిపారు.దీంతో 1706లో పాపన్న మీద దాడి చేసేందుకు మొగల్ సేనాని రుస్థుం ఖాన్ ప్రయత్నం చేసాడు.కాని పాపన్న బలాన్ని సరిగ్గా అంచనా వేయలేక వెనకడుగు వేశారు.1707 లో ఔరంగజేబు చనిపోయిన తర్వాత మొగల్ సింహాసనం ని బహదూర్ షా అధిష్టించటం జరిగినది.ఈ పరిణామంని అతని తమ్ముడు అయిన బీజాపూర్ సుల్తాన్ మహ్మద్ కామ్ తట్టుకోలేక తిరుగుబాటు చేసారు.ఇలా కుటుంబ గొడవల్లో మొగలులు వుండగానే వేలాది మంది సైన్య శీ తో పాపన్న వరంగల్ కోటను స్వాధీనం చేసుకున్నారు.పాపన్న గొప్పతనం తెలుసుకున్న బ్రిటిషు వారు మాత్రం లండన్ మ్యూజియంలో అతని ఫొటో ని పెట్టుకున్నారు.కానీ ఇప్పటి వరకు మన వాళ్లు రాసిన చరిత్ర లో కనిపించదు.వీరు జన్మించిన జనగామ జిల్లాకి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేయాలి.ప్రతీ జిల్లాల్లోవీరి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలి.ఖిలాశాపూర్ గ్రామం ని పర్యాటక ప్రదేశంగా నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలి.వీరు ఏప్రిల్ 2 1710 లో మరణించారు వారి వర్ధంతి ని వాడ వాడల జరుపుకోవాలి.వీరి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు అధ్యయనం చేయాలి.



# బహుజన తొలి విప్లవ వీరుడు... తెలంగాణా శివాజీ మన సర్వాయి పాపన్న

## -నేడు అయన వర్ధంతి



బహుజన తొలి విప్లవ వీరుడు,తెలంగాణా శివాజీ మన సర్వాయి పాపన్న వరంగల్ జిల్లా జనగాం దగ్గర కైలాస్ పూర్ గ్రామంలో గౌడ కులంలో 1650 లో జన్మించారు, తండ్రి చిన్న తనం లోనే చనిపోయారు, సర్వమ్మ అతడి తల్లి, పాపడు అని అతన్ని పిలిచేవారు.పాపన్న ఎల్లమ్మకు పరమ భక్తుడు, అతను శివున్ని ఆరాధించేవాడు, తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు, కాని అతని మనసులో మాత్రం తెలంగాణా లో అంతకంతకు పెరుగుతున్న ముస్లింల ఆధిపత్యాన్ని అంతం చెయ్యాలని ఉండేది, అందుకోసం అతను గెరిల్ల సైన్యాన్ని తాయారు చేసాడు, ఆ సైన్యం ద్వారా మొగలు సైన్యం పై దాడి చేసే వాడు,1675 లో సర్వాయి పేట లో తన రాజ్యాన్ని స్థాపించాడు, తన సొంత ఊరు కైలాస్ పూర్ రాజధాని. ఇతను శివాజీకి సమకాలికుడు, శివాజీ ముస్లింల పాలనా అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణాలో ముస్లింల పాలనా అంతానికి పోరాడాడు, 1687 - 1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగాజేబ్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు, పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు, 1678 వరకు తాటికొండ, వేములకొండాలను తన ఆధీనం లోకి తెచ్చుకొని దుర్గాలను నిర్మించాడు, 1700 - 1705 మధ్య కలం లో షా పుర లో మరొక దుర్గం నిర్మించాడు, అతని సామ్రాజ్యం తాటికొండ, కొలనుపాక, చేర్యాల నుండి కరీం నగర్ జిల్లా లోని హుసనాబాద్, హుజురా బాద్ విస్తరించింది, భువనగిరి కోటను రాజధానిగా చేసుకొని అతను ముప్పై సంవత్సరాలు పరిపాలించాడు. పాపన్నఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చిన వాడు కనుక అతనికి ప్రజల కష్ట నష్టలన్నీ తెలుసు, అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు, ఖజానా కొరకు అతను జమిందార్, సుబేదార్ లపై తన గెరిల్ల సైన్యంతో దాడి చేయించేవాడు, పాపన్న అనేక ప్రజామోద యోగ్యమైన పనులు చేసాడు, అతని రాజ్యం లో సామజిక న్యాయం పాటించేవాడు, తాటి కొండలో చెక్ డాం నిర్మించాడు, అతను ఎల్లమ్మకు పరమ భక్తుడు కావున హుజురా బాద్ లో ఎల్లమ్మ గుడి కట్టించాడు, అది నేటికి రూపం మారిన అలానే ఉంది.పాపన్న గెరిల్ల సైన్యం తో మొగల్ సైన్యం పై దాడి చేస్తున్నాడని ఔరంగజేబ్ కు తెలిసింది, అతడు రుస్తుం దిల్ ఖాన్ కు భాద్యతలు అప్పగించాడు, రుస్తుం దిల్ ఖాన్ యుద్దానికి ఖాసిం ఖాన్ ను పంపించాడు, శఃపుర వద్ద ఇరు సైన్యాలు తలపడ్డాయి, నెలలపాటు యుద్ధం జరిగింది, చివరికి రుస్తుం దిల్ ఖాన్ రంగం లోకి దిగాడు, సుమారు 3 నెలలపాటు యుద్ధం జరిగింది, పాపన్న తన ప్రాణ స్నేహితున్ని కోల్పోయాడు, దాంతో ఆయన యుద్దాన్ని విరమించుకున్నాడు, అతను అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు, మొగల్ సైన్యాలు అతని కోసం వెతకడం ప్రారంభించాయి, అయితే పాపన్న తన సొంత ఊరు జనగామ కు వెళ్లి అక్కడ గౌడ కులం వారు ఎక్కువగా ఉండే చోట జీవితం గడిపాడు, ఔరంగజేబ్ మరణించిన తర్వాత దక్కన్ పాలకుడు కంబక్ష్ ఖాన్ బలహీన పాలనను చుసిన పాపన్న 1 ఏప్రిల్ 1708 లో వరంగల్ కోటపై దాడి చేసాడు, అయితే ఈ దాడిలో పాపన్న పట్టుబడ్డాడు.2 ఏప్రిల్ 1708 లో గోల్కొండకు తీసుకెళ్ళి పాపన్న తల తీసి కోట ముఖ ద్వారానికి వెల్లడ దీసారు. తెలంగాణా పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర సమైక్య పాలన లో అజ్ఞాతంలోకి వెళ్ళింది, మన పోరాట యోధులను మనమే గుర్తించాల్సిన అవసరం, ఆ భాద్యత మనపైనే ఉంది.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

మందమర్రి, ఏప్రిల్ 01, నేషనలిస్ట్ వాయిస్ దినపత్రిక విలేఖరి

ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. ఏప్రిల్ 4, 2026న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికల దృష్ట్యా బుధవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం, ఎన్నికల వేదికలను స్థానిక ఏసీపీ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నోటీసులను ఎన్నికైన కౌన్సిలర్లకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు కూర్చునే ఏర్పాట్లు, సమావేశ మందిరంలో సక్రమంగా అమరికలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల సజావుగా జరిగేలా వేదిక, మైక్ వ్యవస్థ, రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు..అసిస్టెంట్ ఇంజనీర్‌కు ప్రత్యేకంగా సూచనలు ఇస్తూ, ఎన్నికల వేదిక పరిసర ప్రాంతాలలో బారికేడింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి రాకపోకలు సులభంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు. చట్టం--



శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఏసీపీ, సీఐలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎటువంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పరోక్ష ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏసీపీ, సీఐ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఇంజనీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా పౌరసంబంధాల అధికారిచే జారీ చేయనైనది.

# కే.కే.ఓ.సీపీ కార్మికులకు మజ్జిగ పంపిణీ ప్రారంభించిన మందమర్రి జీ.ఎం రాధాకృష్ణ.

మందమర్రి, ఎప్రిల్ 01, నేషనలిస్ట్ వాయిస్ దినపత్రిక విలేఖరి

పెరుగుతున్న ఎండల దృష్ట్యా కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, మందమర్రి ఏరియాలోని కేకేఓసీపీ (కెకె–ఓసిపి) ప్రాజెక్టులో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని జనరల్ మేనేజర్ శ్రీ రాధాకృష్ణ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ప్రాజెక్ట్ కాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.చారిత్రాత్మక రికార్డు: ఒక్కరోజే 10,909 టన్నుల బొగ్గు రవాణా ఈ సందర్భంగా జీ.ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ కేకేఓసీపీ సాధించిన అద్భుతమైన విజయాలను కొనియాడారు:రికార్డు స్థాయి డిస్పాచ్: గత మార్చి 31, 2026 నాడు కేకేఓసీపీ ఏకంగా 10,909.44 టన్నుల బొగ్గును రవాణా (డిస్పాచ్) చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. అలాగే మార్చి 2026లో సాధించిన 2,30,464 టన్నుల అత్యధిక నెలవారీ డిస్పాచ్ మరో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యధిక ఒక్కరోజు డిస్పాచ్‌గా నమోదు కావడం విశేషమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. మందమర్రి ఏరియా మొత్తం ఉత్పత్తి పురోగతిలో కేకేఓసీపీ కీలక పాత్ర పోషిస్తోందని, ఇక్కడి పనితీరు సంస్థ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.మార్చి నెలలో సాధించిన ఈ భారీ విజయం కేవలం ఉద్యోగుల క్రమశిక్షణ, నిబద్ధత మరియు సమిష్టి కృషి వల్లే సాధ్యమైంది. ఇదే ఉత్సాహంతో రాబోయే రోజుల్లో మరిన్ని లక్ష్యాలను చేరుకోవాలి. అని అన్నారు.ఈ కార్యక్రమంలో జీ.ఎం తో పాటు శ్రీ ఎం. మల్లయ్య (ప్రాజెక్ట్ ఆఫీసర్),శ్రీ ఎన్. వెంకటవంశీధర్ (ప్రాజెక్ట్ ఇంజనీర్),శ్రీ ఎస్. రమేష్ (సీఎంఓఏఐ మందమర్రి అధ్యక్షుడు),శ్రీ రాజేష్ కుమార్ యాదవ్ (ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ),కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.



# మహనీయుల జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహణకు సన్నాహాలు



## సమన్వయంతో ఘనంగా జరుపుదాం

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ ఏప్రిల్ 01(నేషనలిస్ట్ వాయిస్)

కరీంనగర్‌లో బాబు జగ్జీవన్ రామ్ (ఏప్రిల్ 5) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ (ఏప్రిల్ 14) జయంతి ఉత్సవాలను ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఉత్సవాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మహనీయుల విగ్రహాల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు.



జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాలల్లో మహనీయుల జీవిత చరిత్రపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు వీడియో ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. దళిత సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఉత్సవాలను విజయవంతం చేస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్, అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ తదితర అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పివి వ్యాక్సినేషన్

పెగడపల్లి (ధర్మపురి) : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01:



జగిత్యాల జిల్లా, పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో హెచ్పివి వ్యాక్సినేషన్ ను స్థానిక సర్పంచ్ ఒరుగల అరుణ - శ్రీనివాస్ తో కలిసి ఏఎంసి చైర్మన్ బుర్ర రాములు గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని14, 15 సంవత్సరాల బాలికలు అందరూ వినియోగించుకుని గర్భాశయ క్యాన్సర్ వ్యాధి నుండి రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు మోకినపల్లి గోపాల్, రమేష్ నాయక్, మ్యాకల అంజమ్మ -మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన విద్యార్థుల మధ్య మంత్రి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు



## ధర్మారం మినీ గురుకులంలో కేక్ కట్ చేసిన మంత్రి అడ్లూరి

## పాఠశాలను పదవ తరగతి వరకు అప్ గ్రేడ్ చేస్తానని హామీ.

ధర్మపురి ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01:

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తన జన్మదిన వేడుకలను ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండల కేంద్రంలోని మినీ గురుకుల పాఠశాలలో గిరిజన విద్యార్థుల మధ్య బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మినీ గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు నూతన కిచెన్ షెడ్ ను మంత్రి



ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యకు ప్రధాన ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మపురికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు మంజూరి చేసిందని మంత్రి అడ్లూరి తెలిపారు.ధర్మారం మండలంలోని గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుండి పదవ తరగతి వరకు తరగతులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. రాజకీయంగా తొలిసారి అవకాశం కల్పించిన ధర్మారం మండలంపై తనకు ప్రత్యేక గౌరవం ఉంటుందని మంత్రి తెలిపారు. గెలిచినా ఓడిన ధర్మారం మండల ప్రజలు తన వెన్నంటి ఉన్నారని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మారం మండలానికి ఇప్పటికే ఐటిఐ కళాశాల మంజూరు చేశామని, రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాల మంజూరుకి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు సైకిళ్ళతో పాటు పరీక్షలకు

# గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కి వినతి పత్రం

కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గ్రామం గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహణకు వడ్లకొండ రవీందర్ గౌడ్ గ్రామ సర్పంచ్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వడ్లకొండ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఎల్కలపల్లి గ్రామంలో ప్రజాగ్రంథాలయం ఏర్పాటు చేయాలని వడ్లకొండ రవీందర్ గౌడ్ గ్రామ సర్పంచ్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగిందని.ఆలాగే గ్రంథాలయం ద్వారా విద్యార్థులు, యువతకు చదువుకు అనుకూల వాతావరణం కలుగుతుందని, పఠన అలవాటు పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీ గది కేటాయించాలని కోరారు. అదేవిధంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కూడా వినతి పత్రంలో కోరారు. దీనికి స్పందించిన గ్రామ సర్పంచ్ ఎరుకల అంజి మాట్లాడుతూ త్వరలోనే గ్రంథాలయం కు ఏర్పాటు చేస్తానని, ఈ కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహిస్తామని గ్రామ సర్పంచ్ ఎరుకల అంజి తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్లకొండ రవీందర్ గౌడ్, గుండు లక్ష్మణ్, మేకల సంజీవ్, దొరగొల్ల విష్ణు, వంశీ, చింతపూవు ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



# కౌశిక్ రెడ్డిది ప్రశ్నించే గొంతుకాదు

**నమ్మి చేరదీసిన బి ఆర్ ఎస్ పార్టీకి గోరికట్టే గొంతు**

**తన పోరాటం వ్యక్తి గతం తెలంగాణ వ్యాప్తంగా బి ఆర్ ఎస్ పార్టీకి నష్టం**

**బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్**



**హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 01(నేషనలిస్ట్ వాయిస్):**

హుజురాబాద్ యం ఎల్ ఏ పాడి కౌశిక్ రెడ్డి గారు తను బి ఆర్ ఎస్ పార్టీకి వచ్చి యం ఎల్ సి గా అప్పటి తెలంగాణ రాష్ట్ర విప్పు గా పనిచేసిన కాలంనుండి నేటివరకు బి ఆర్ ఎస్ పార్టీకి నష్టం కలిగించే పనులే చేసాడు కానీ ఒక్క పనికుడా పార్టీకి పనికొచ్చేది చేయలేదని తను పదవిలో కొచ్చాక ఇక్కడి ప్రజలను కులాల వారిగా మతాల వారిగా దూషిస్తూ కార్యకర్తల పట్ల నిరంకుశంగా ప్రవర్తిస్తూ ఇటు పార్టీకి అటు పార్టీ పెద్దలు తెలంగాణ రాష్ట్ర సాధకుడు గౌరవ కె సి యర్ గారికి కె టి ఆర్ గారికి చెడ్డపేరు తేవడమే కాక హుజురాబాద్ ప్రాంతంలో బి ఆర్ ఎస్ పార్టీని బలహీన పరుస్తున్నడని బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ లో ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ వ్యతిరేకులతో చేతులు కలిపి మనుకోటలో ఉద్యమకారులపై రాళ్ళదాడి చేసి ఆతర్వాత దొడ్డి దారిన టి ఆర్ ఎస్ తీర్థం పుచ్చుకుని ఇప్పుడు పార్టీలోని ఉద్యమకారులను పట్టుకొని ఒళ్ళు దగ్గరపెట్టుకొని పనిచేయాలని లేదంటే బి ఆర్ ఎస్ పార్టీలో ఉంటే ఉండండి లేపోతే పీకేయండి అని దురుసు పదజాలంతో మాట్లాడే స్థితికి వచ్చాడని ఆయన తెలిపారు.యం ఎల్ ఏ కౌశిక్ రెడ్డిగారు పార్టీ ముసుగులో తన సొంత ఏజండాలు అమలుచేసుకుంటు పోలీస్ కేసుల్లో ఇరికిస్తూ ఇక్కడి సీనియర్ బి ఆర్ ఎస్ నాయకుల భవిషత్తు ను ప్రశ్నార్ధకం చేస్తున్నాడని అందుకే ఇక్కడి నాయకులు తనకు సహకరించకూడదనే స్థితిలో ఉన్నారు అని సమ్మయ్య స్పష్టం చేసారు..ఇప్పటికైనా పార్టీ పెద్దలు చొరవ తీసుకొంటే తప్ప సద్దుమనగని పరిస్థితులు హుజురాబాద్ బి ఆర్ ఎస్ లో ఉన్నాయని లేకుంటే ముందు ముందు యం ఎల్ ఏ పాడి కౌశిక్ రెడ్డి గారి వింత పోకడలతోఈ నియోజకవర్గం లో బి ఆర్ ఎస్ పార్టీ బలహీన పడే అవకాశం ఉందని సమ్మయ్య ఆవేదన వ్యక్తంచేశారు.

# శాతవాహన ఆడిటోరియంలో దేశభక్తి చిత్రాల ప్రదర్శన

**కరీంనగర్ ఏప్రిల్ 01 (నేషనలిస్ట్ వాయిస్)**

శాతవాహన విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ ఆడిటోరియంలో దేశభక్తి చలన చిత్రాలను చూపించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తిని నింపేందుకు, మానసిక ధైర్యాన్ని పెంచేందుకు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రేరణ కలిగించే ఉత్తేజ కరమైన సామాజిక అంశాలపై పట్టు కలిగించి ధైర్యాన్ని పెంచే వివిధ రకాల చలన చిత్రాలను ప్రతి శనివారం సాయంత్రం 4 గంటల నుండి 6:30 వరకు ప్రదర్శిస్తామని దీనివలన విద్యార్థులకు ఆలోచన శక్తితో పాటు, దేశభక్తితో పాటు తమ లక్ష్యాలను చేర్చుకొని చేరుకునేందుకు ప్రేరణను, సహాయాన్ని కలిగిస్తాయని తెలియజేస్తూ విద్యార్థులకు చదువులతో పాటు సామాజిక అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని దీనివలన శారీరక, మానసిక దృఢ సంకల్పం పెరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, వివిధ కళాశాలల విభాగాధిపతులు, అధ్యాపకులు, కోఆర్డినేటర్ డాక్టర్ నరేష్ సైన్స్,ఆర్ట్స్, కామర్స్,న్యాయ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని బలగం సినిమాను వీక్షించారు.






# ఇందిరమ్మ గృహప్రవేశాల్లో కాంగ్రెస్ నాయకులు.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1.**

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో ఇందిరమ్మ గృహాల గృహప్రవేశాలకు కాంగ్రెస్ నాయకులు బుధవారం హాజరయ్యారు.మండలం లోని మచ్చుపెట గ్రామనికి చెందిన తాళ్లపల్లి సుజాత-యుగేందర్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన ఇందిరమ్మ ఇళ్ళనిర్మాణం పూర్తి అవ్వడంతో బుధవారం వారి గృహ ప్రవేశంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి లబ్ధిధారులతో కలిసి పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎక్స్ జడ్పీటీసీ చొప్పరి సదానందం ,ముత్తరాం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ గృహప్రవేశం చేయించారు.వారి వెంట జిల్లా ఎస్క్యూటివ్ మెంబెర్ తాళ్లపల్లి కుమారు,ఉపసర్పంచ్ దొంతల రాకేష్,ఎక్స్ సర్పంచ్ మెడగొని సతీష్, కాంగ్రెస్ నాయకులు పర్లాపల్లి సంపత్,లక్కమ్ ప్రభాకర్ పాల్గోన్నారు.



# ఓ సి పి వన్ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1.**

సింగరేణి సంస్థ ఆర్ జి త్రీ పరిధిలోని ఓసీపీ-1 సైట్ ఆఫీస్ కార్యాలయము లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా వేసవికాల తాపాన్ని తగ్గించడానికి చేపట్టే చర్యలలో భాగంగా ఉద్యోగులందరికీ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఓసీ-1 ప్రవీణ్ వి ఫాటింగ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, వేసవికాల రక్షణ చర్యలలో భాగంగా ఉద్యోగులందరికీ చల్లటి త్రాగు నీరు, ఎయిర్ కూలర్లు, అంబ్రెల్లా, తట్టీలు, రంజన్లు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు ఈ రోజు నుండి ఉద్యోగులందరి ఆరోగ్యాలని దృష్టిలో ఉంచుకొని వేసవి కాలం ముగిసే వరకు అందరికీ మజ్జిగ పాకెట్స్ , ఓఆర్ఎస్ పాకెట్స్ అందిస్తున్నామని అన్నారు,ఈ కార్యక్రమంలో మేనేజర్ రావుల పాపయ్య, సేఫ్టీ ఆఫీసర్ అజయ్ కుమార్, బైరి రమేష్, బోనుకూరు మోహన్, కిషన్, గుర్తింపు సంఘం ప్రతినిధి డి తిరుపతి రావు, ప్రాతినిధ్య సంఘం ప్రతినిధి గడ్డం తిరుపతి ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




# ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు

**-చిక్సిత కోసం రూ.2లక్షల50వేల ఎల్ఓసి అందజేత**

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 01:**

మంథని మండలంలోని అక్క పెల్లి గ్రామానికి చెందిన సిద్ధం జ్యోతిర్మయి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు సహాయం కొరకు తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సంప్రది ంచగా వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి రూ. 2లక్షల 50వేల ఎల్వోసి మంజూరు చేసి ఇప్పించారు.బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు వారికి హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి పత్రాలను అందజేశారు. 2లక్షల 50వేల ఎల్ఓసి మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకు జ్యోతిర్మయి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



# లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**-సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్**

**-మంథనిలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన సీఐటీయూ**

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 01:**

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ డిమాండ్ చేశారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను నిరసిస్తూ సిఐటియు ఇతర కార్మిక సంఘాలు ఇచ్చిన బ్లాక్ డే పిలుపులో భాగంగా బుధవారం మంథనిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లాకార్డ్ లు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మంద బలంతో పార్లమెంట్లో 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని ఈరోజు ఏప్రిల్ ఒకడి నుండి అమలు చేయడానికి రంగం సిద్ధం చేసుకుందని అన్నారు. లేబర్ కోడ్లు అమలు అయితే కార్మికులు బానిసత్వంలోకి నెత్తివేయబడతారని అన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చి కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే ఈ విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమింప చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం లేబర్ కోడ్ ల పై అసెంబ్లీ చర్చించి లేబర్ కోడ్ ల ను రాష్ట్రంలో అమలు చేయమని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. లేబర్ కోడ్ ల కు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు మేధావులు అభ్యుదయవాదులు గళం విప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మల్లేష్, సింగారపు గట్టయ్య, రాజయ్య, పోచమ్మ ,దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఫోన్ లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**బర్త్ డే గిఫ్ట్ గా అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను పరిహారం చెల్లించాలని సూచన**

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01 :**

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి , పెంబట్ల గ్రామాలలో మంగళవారం ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షంతో నేలకొరిగిన మొక్కజొన్న, నువ్వుల పంటలను, లక్ష్మీదేవిపల్లెలో రవి నాయక్ బీరకాయ తోటను రైతులతో కలిసి మాజీ మంత్రి జీవన్ రెడ్డి బుధవారం పరిశీలించారు., మొదటగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు జీవన్ రెడ్డి ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, జిల్లాలో కురిసిన అకాల వర్షంతో జగిత్యాల నియోజకవర్గంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు., జన్మదిన కానుకగా రైతులు ఎవరు అధైర్యపడొద్దని ప్రకటన చేసి కలెక్టర్ తో నివేదిక తెప్పించుకొని ప్రభుత్వ పరంగా త్వరగా పరిహారం అందేలా చూడాలని కోరారు. పంటల బీమా పథకం అమలు చేస్తే కొంత రైతుకు ఊరట కలుగుతుండేనని ప్రభుత్వం వెంటనే పంటల బీమాపై దృష్టి పెట్టాలని , ప్రభుత్వం రైతును ఆదుకున్నప్పుడే రైతాంగం పై ఆధారపడి ఉన్న రైతు కూలీలకు ఉపాధి కలిగించిన వాళ్ళం అవుతామని తెలిపారు. అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 వేలు చెల్లించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కోరారు.



# సంక్షేమ హాస్టళ్లపై తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలి

**60 రోజుల్లో హాస్టళ్లలో మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలి**

**జగిత్యాల జిల్లా సంక్షేమ హాస్టళ్ల సమీక్షలో మంత్రి అడ్లూరి.**

**జగిత్యాల ప్రతినిధి: నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01 :**

ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి సంక్షేమ హాస్టళ్లను నిర్వహిస్తుందని, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు నమ్మకం కలిగే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా పని చేయాలని అధికారులకు మంత్రి అడ్లూరి సూచించారు. జగిత్యాల లోని కలెక్టర్ సమావేశ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ అధికారులతో బుధవారం ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. విద్యార్థులకు డైట్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కాస్మెటిక్ చార్జింగ్ పెంచామని మంత్రి అన్నారు. సంక్షేమ హాస్టల్స్ బిల్లులు పెండింగ్ లో ఉండడం వలన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదనే భావన ఉండకుండా ఇక మీదట ఒకటవ తేదీ నుండి 7వ తేదీ లోపు బిల్లును చెల్లించే విధంగా రెవెన్యూ మంత్రితో మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. హాస్టళ్లకు సంబంధించి అన్ని బిల్లులు ప్రతినెలా చెల్లించే విధంగా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, సౌకర్యాలు, తదితర విషయాలపై జిల్లా స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం వేసవి సెలవులు వస్తున్న నేపథ్యంలో సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలపై కార్యాచరణ తీసుకుని 60 రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్కడ పొరపాటు జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ బి.ఎస్ లత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బోయిన్ పేట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి కి ముదిరాజ్ కులస్థుల ఆత్మీయ సన్మానం

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 01:**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా 6వ వార్డు నుండి పోటీ చేసి అత్యంత భారీ మెజారిటీతో కౌన్సిలర్ గా గెలుపొందిన పోతరవేని శ్రీలతక్రాంతి ని బుధవారం బోయిన్ పేట్ కు చెందిన ముదిరాజ్ కుల పెద్దమనిషులు శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం పోతరవేని శ్రీలతక్రాంతి మాట్లాడుతూ బోయిన్ పేట్ అభివృద్ధి కి నిరంతరం కృషిచేస్తామని ఇంతటి ఘన విజయాన్ని అందించిన బోయిన్ పేట్ 6వార్డ్ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పేట్ ముదిరాజ్ కుల పెద్దమ నుషులు మహిళలు ముదిరాజ్ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి





### కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

### జిల్లాలోని ప్రత్యేక పరిస్థితులను ముఖ్యమంత్రికు వివరిస్తా

### జగిత్యాల జిల్లా వరి ధాన్యం కొనుగోలు సమీక్ష సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01**

రబీ సీజన్ లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రబీ వరి ధాన్యం కొనుగోలుపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో పాటు రైస్ మిల్లలతో మంత్రి లక్ష్మణ్ కుమార్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... మరో వారం పది రోజుల్లో జిల్లాలో రబీ వరి పొలాల కోతలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. వేసవి ఎండలతో రోజురోజుకు ఉష్ణోగ్రతను పెరుగుతున్నాయని ఈనేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీటి సౌకర్యంతో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి సూచించారు. ఈ రబీ సీజన్లో జగిత్యాల జిల్లాలో 4.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేశారని మంత్రి తెలిపారు. ధాన్యం సేకరణ కోసం జిల్లాలో 407 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని, తప్ప తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించవద్దని అధికారులను మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. జగిత్యాల జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితిలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి మిల్లర్ల సమస్యకు పరిష్కారం చూపిస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అడిషనల్ కలెక్టర్ బి.ఎస్ లత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, సివిల్ సప్లై అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శారీరక వ్యాయామం తప్పనిసరిగా చేయాలి

### హుజురాబాద్ పట్టణ సీఐ కరుణాకర్

**హుజురాబాద్, ఏప్రిల్ 1 (నేషనలిస్ట్ వాయిస్ రూరల్ ):**

ప్రతి మనిషి తన జీవనశైలిలో వ్యాయామం అలవాటు చేసుకోవాలని హుజురాబాద్ టౌన్ సిఐ కరుణాకర్ అన్నారు. బుధవారం అంబేద్కర్ చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటి జీవన విధానంలో శారీరక వ్యాయామం రోజుకు ఒక గంట సమయం చేయాలని అన్నారు. వ్యాయామంతో శారీరకంగా ఫీట్ గా ఉండడంతోపాటు మానసిక ఆందోళనలు కూడా దూరమవుతాయని అన్నారు. వ్యాయామం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్ యజమాని రవి తో పాటు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# తల్లిదండ్రులు అంటే భయం, భక్తి ఉండటానికే తల్లిదండ్రుల సంరక్షణ చట్టం.





### ఫిర్యాదు చేసిన 60 రోజుల్లో సమస్య పరిష్కారం.

### రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01**

అనేక కష్టనష్టాలకు ఓర్చి పిల్లలను ప్రయోజకులను చేస్తే వృద్ధాప్యంలో తల్లి దండ్రుల పోషణ మరచి పోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారి కోసం ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల సంరక్షణ, పర్యవేక్షణ చట్టం 2026 తీసుకువచ్చామని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల తల్లిదండ్రుల సంరక్షణ - పర్యవేక్షణ చట్టంపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్స్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... తల్లిదండ్రులు పోషణ, పరిరక్షణ పట్టించుకోని కొడుకులకు భయం, భక్తి ఉండటానికే కొత్త చట్టం తీసుకు వచ్చామని మంత్రి లక్ష్మణ్ తెలిపారు. బాధిత తల్లి దండ్రులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసే 60 రోజుల్లో విచారణ జరిపి న్యాయం చేస్తారని మంత్రి తెలిపారు. కొత్త చట్టం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు సైతం చట్టం వర్తిస్తుందని మంత్రి తెలిపారు. అసెంబ్లీలో, మండలిలో బిల్లు ప్రవేశ పెట్టడానికి అవకాశం రావడం సంతోషంగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక రకాలుగా ఆలోచన చేసి కొత్త చట్టం తీసుకు వచ్చారని మంత్రి తెలిపారు. చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి వివరించారు. కొత్త చట్టాన్ని అమలు చేయడానికి పోలీసుల సహకారం తీసుకోవాలని మంత్రి సూచించారు. చట్టం అమలుపై రాష్ట్ర డీజీపీతో పాటు జిల్లా పోలీసు అధికారులకు తాను లేఖ రాస్తానని మంత్రి తెలిపారు.దేశంలో ఎక్కడ లేని చట్టం.తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో తీసుకు వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ - జవాబుదారీతనం పర్యవేక్షణ చట్టం 2026 దేశంలో ఎక్కడ లేని చట్టం అని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజా అన్నారు. అస్సాం రాష్ట్రంలో ఉన్న చట్టం కంటే పదునైన చట్టమని శైలజా అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రిజిస్టర్ అయిన ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం చట్టం వర్తిస్తుందని శైలజా తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 32 లక్షల మంది వయోవృద్ధులు ఉన్నారని, ప్రస్తుతం వీరి సంఖ్య 48 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని శైలజా వివరించారు. తల్లిదండ్రులను కొడుకులు పట్టించుకోకపోతే జిల్లా కలెక్టర్ కు తల్లిదండ్రులు ఫిర్యాదు చేసే విధంగా చట్టాన్ని రూపొందించామని, ప్రత్యేక ఆఫ్పిలేట్ అధికారిని నియమించామని శైలజా తెలిపారు. ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం చట్టం పరిధిలోకి వస్తారని శైలజా వివరించారు.ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్.లను రద్దు చేయాలి.

### పాత కార్మిక చట్టాలను పునరుద్దరించాలి..

### వావిలాల గ్రామ భవన నిర్మాణ కార్మికులు సిఐటిలో చేరిక..

**జమ్మికుంట నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 1..**

జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు బుధవారం సీఐటీయూ లో తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కదిరే రమేష్, ఎడ్ల రమేష్, ఆధ్వర్యంలో చేరారు.లి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, మాట్లాడుతూ కార్మికుల హక్కులను బలహీనం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్సును తక్షణం రద్దు చేయాలన్నారు, లేబర్ కోడ్స్ అమలు ద్వారా భవన నిర్మాణ కార్మికుల మూడు చట్టాలను రద్దు చేసి సోషల్ సెక్యూరిటీ కోడ్ లో చేర్చడం వల్ల వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికులకు చెందకుండా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి హెల్త్ ఏజెన్సీ లాంటి సంస్థలకు అప్పగించి వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీ గుర్తింపు లేకుండా చేశారు. మన తెలంగాణలోనే సిఎస్సి హెల్త్ ఏజెన్సీ రూ.50 వేల కోట్లు, రెండు ఇన్సూరెన్స్ సంస్థలకు 443 కోట్లు దారి మళ్ళించారు. ఇక దేశం మొత్తం ఇలాంటి సంస్థలకు అప్పగించడం పెద్ద ఎత్తున జరుగుతుంది.1996 కేంద్ర చట్టంను పోషమ్మ కూడపెడితే మైసమ్మ మాయం చేసినట్టుగా సోషల్ సెక్యూరిటీ కోడ్ తయారు చేశారు. సెస్ యాక్ట్ ప్రకారం దేశంలో ఎక్కడా ఏలాంటి నిర్మాణం జరిగిన కార్మికులకు వెల్ఫేర్ బోర్డులో నిధులు 1% చొప్పున వెల్ఫేర్ బోర్డు జమ అయ్యేది. ఈ కోడ్ల వల్ల పెద్ద పెద్ద కన్స్ట్రక్షన్ కంపెనీలకు, బిల్డర్లకు, కార్పొరేట్ సంస్థలకు సెస్ నిధులు కట్టవలసిన అవసరం లేదని లేబర్ కోడ్ల స్పష్టంగా తెలియజేయడం జరిగింది. దీనివలన వెల్ఫేర్ బోర్డు పూర్తిగా నిర్వీర్యమై భవన నిర్మాణ కార్మికులకు రావలసిన వివిధ సంక్షేమ పథకాలు రాకుండా పోతాయి. అందుకని ఈ వెల్ఫేర్ బోర్డు సాధన కోసం భవన నిర్మాణ కార్మికులందరూ ఐక్యం చేయడానికి గ్రామ గ్రామాన ఐక్యం చేస్తూ లేబర్ కోడ్స్ రద్దుల కోసం క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తున్నామని లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు అన్ని గ్రామల నుండి కేంద్ర కార్మిక సంఘాలు కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత హామీ ఇస్తూ ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. ప్రమాద బీమా వంటి కనీస అవసరాలు తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ ఆధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి రావుల ఎల్లయ్య, జమ్మికుంట నాయకులు ఆనంద్, వావిలాల గ్రామ అధ్యక్షులు రాజయ్య, ఎగిత రమేశ్, బోయినీ సమ్మయ్య, కలకోట రాజు, కలకోట సమ్మయ్య, పుల్లూరు దేవయ్య, కలకోట కుమార్, తదితరులు పాల్గొన్నారులి



# రైతులెవరు అధైర్య పడొద్దు ... ప్రభుత్వం అండగా ఉంటుంది





### అకాల వర్షానికి పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం

### యుద్ధ ప్రాతిపాదికన అధికారులు పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలి

### గొల్లపల్లి మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి అడ్లూరి.

**ధర్మపురి ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 01**

జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కురిసిన ఆకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు యుద్ధ ప్రాతిపాదికన అంచనాలు తయారు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని భీమరాజు పల్లి గ్రామంలో మంగళవారం కురిసిన ఆకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంత్రి లక్ష్మణ్ కుమార్ వ్యవసాయ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ఆకాల వర్షాలకు జగిత్యాల జిల్లాలో 6160 ఎకరాల్లో మామిడి పంట, 1029 ఎకరాల్లో వరి, 1520 ఎకరాల్లో మొక్కజొన్న, 581 ఎకరాల్లో నువ్వు పంటలు దెబ్బ తిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారని మంత్రి తెలిపారు.రైతులెవరు అధైర్య పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని, అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. పెట్టుబడులు పూర్తయి పంట చేతికి వచ్చే సమయంలో ఇలా నష్టపోవడం చాలా బాధాకరమని మంత్రి అన్నారు. అధికారులు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం వచ్చే విధంగా అంచనాలు రూపొందించి నివేదికను పంపించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆర్డిఓ మధుసూదన్, గొల్లపల్లి మండల తహసిల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు, ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య

**నేషనలిస్ట్ వాయిస్, మంచిర్యాల :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య అన్నారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ నస్పూర్ పరిధిలోని తాళ్లపల్లి సింగాపూర్ గుత్తేదారుపల్లి ప్రాంతాలలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ అభివృద్ధి పనుల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న బయో మైనింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆండాళమ్మ కాలనీ డంపింగ్ యార్డులో బయో మైనింగ్ పనులు పూర్తి అయ్యాయని ఈ ప్రాంతంలో త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు తాళ్లపల్లి సింగాపూర్ రిహాబిలిటేషన్ రీ సెటిల్మెంట్ కాలనీలో సందర్శించి పారిశుద్ధ్య పరిస్థితులు మురుగు కాలువ వ్యవస్థ నిర్వహణ పరిశీలించి క్రమం తప్పకుండా శుభ్రత చర్యలు చేపట్టాలని డివిజన్ పూర్తి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్థానిక ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలు వివరాలను తెలుసుకున్నారు. రుణాల మంజూరు విషయంలో తలెత్తిన ఇబ్బందులు పారిశుద్ధ్య సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా పర్యవేక్షించాలని అనంతరం నెన్నెల మండలంలోని గ్రామపంచాయతీలలో పర్యటించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుతీరును పరిశీలించారు చెత్త సేకరణ అంతర్గత రహదారుల శుభ్రత మురుగు కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడగా బిల్లుల మంజూరులో ఆలస్యం జరుగుతుందని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు గృహ జ్యోతి ఇతర సంక్షేమ పథకాల అమలు వివరాలను తెలుసుకొని పథకాల నిర్వహణలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ కార్పొరేటర్,నెన్నెల మండల పరిషత్ అభివృద్ధి అధికారి హై మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ మహిళల అవమానం

## క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్

**నేషనలిస్ట్ వాయిస్:తాండూర్**

తాండూర్ మండలం కిష్టంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదివాసీ గిరిజన మహిళలు తమ పోడు భూముల సమస్యపై సోమవారం రోజున తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేయడానికి ప్రయత్నించిన సమయంలో అవమానకర సంఘటన చోటుచేసుకుంది.గౌరవనీయమైన హోదాలో ఉన్న తహసీల్దార్, మహిళల సమస్యలు వినాల్సిన బదులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సాటి మహిళల పట్ల చూపాల్సిన గౌరవం లేకుండా అవమానకరంగా ప్రవర్తించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన ఆదివాసీ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆదివాసీ నాయకులు నాయకులు మంగళవారం ఖండించారు.తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన మహిళలు గంగుల లక్ష్మి, టేకం జ్యోతి, టేకం సాలక్క, టేకం శంకరమ్మ, కోయ భాగ్య, ఊరడి బుజ్జమ్మ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు.ఈ నేపథ్యంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి "తుడుం దెబ్బ" నాయకులు స్పందిస్తూ, ఆదివాసీ మహిళలను అవమానించిన తహసీల్దార్ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సమితి నాయకులు మండిగ రవీందర్, యాపల సమ్మయ్య, గడ్డం మణికుమార్, టేకం రాజేష్, ఊరడి మహేష్, మండిగ చిన్నయ్య, టేకం రాజయ్యతో పాటు అనేక మంది ఆదివాసీ మహిళలు పాల్గొని సంఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# విద్యార్థులకు పెన్నుల పంపిణీ

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించు కొని ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన 8 వ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు లైశెట్టి శ్రీలేఖ సంతోష్ విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంత్రి మీద అభిమానంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుల సమక్షంలో పెన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర.







## బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**నేషనలిస్ట్ వాయిస్, గోదావరిఖని :**

స్థానిక శ్రీ కోదండ రామాలయం నుండి మారుతి నగర్ హనుమాన్ దేవాలయం వరకు ర్యాలీ కొనసాగింది.

ఈ కార్యక్రమానికి విశ్వహిందు పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ ముష్కే సంపత్ యాదవ్ ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ హనుమంతుని ఆదర్శంగా తీసుకుని హనుమంతుని పేరుతో 1984లో రామ రామ రథయాత్రకి రక్షణగా బజరంగదళ్ సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో రామరథయాత్ర జరిపితే ప్రతి హనుమాన్ దేవాలయంలో రామాలయాలలో నమాజ్ చేస్తామని ముస్లింలు జయభ్రాంతికి గురి చేస్తే రామరథయాత్రని అడ్డుకుంటే ప్రతి మసీదులో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తూ ప్రతి మసీదును హిందూ దేవాలయంగా మార్చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేసి రామ రథయాత్ర రక్షణగా ఆనాటి నుండి ఈనాటి వరకు హిందూ సమాజం కోసం పని చేస్తున్నదని తెలియజేయటం జరిగింది. సేవ సురక్ష సంస్కార్ అనే నినాదంతో హిందూ సమాజానికి సేవ చేయడం సురక్షితంగా ఉంచుతూ సంస్కారాన్ని అందించడం బహిరంగదల్ యొక్క లక్ష్యం అని అన్నారు. దేశ ధర్మ రక్షణ కోసం ప్రాణాలర్పించడానికి అయిన సిద్ధమై బజరంగదళ కార్యకర్తలు పనిచేస్తున్నారని లవ్ జిహాద్ ల్యాండ్ జిహాద్ వ్యాపార జిహాద్ పేరుతో ఇతర మతస్తులు హిందూ సమాజాన్ని ఇబ్బందులు పెడుతుంటే భజరంగ్దళ్ హిందూ సమాజాన్ని కాపాడడం కోసం హిందూ సమాజంపై జరుగుతున్న దాడులకి ఆకృత్యాలకి వ్యతిరేకంగా పోరాడుతూ భారతదేశంలో ఉంటూ దేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు చేసే వారికి వ్యతిరేకంగా పనిచేస్తుందని అన్నారు ప్రతి బస్తీలో ప్రతి గ్రామంలో భజరంగ్ దళ్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని మతమార్పిడులను హిందూ సమాజంపై మారణహోమాలను ఆపడం కోసం బజరంగదళ్ కమిటీ పని చేస్తుందని తెలియజేశారు. పారిశ్రామిక ప్రాంతంలో ప్రతి బస్తీలో బజరంగ్దళ్ కార్యకర్తలు అహర్నిశలు కృషి చేస్తున్నారని హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం కోసం కులాలకు వర్గాలకు అతీతంగా కార్యకర్తలు పనిచేస్తున్నారని వేలాదిమంది హిందూ సమాజాన్ని సంఘటన చేయడం కోసం రానున్న రోజుల్లో మరింతగా పనిచేస్తామని హనుమాన్ జయంతి సందర్భంగా కాషాయ శోభయాత్ర వేలాది మందితో నిర్వహిస్తున్నామని తెలియజేయడం జరిగింది. శ్రీ కోదండ రామాలయం నుండి ప్రధాన చౌరస్తా శివాజీ నగర్ కళ్యాణ్ నగర్ లక్ష్మీ నగర్ మీదుగా మారుతీ నగర్ హనుమాన్ దేవాలయం వరకు శోభయాత్ర జరపడం జరిగింది.ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్,నగర కార్యదర్శి మునిగాల సంపత్, బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ ముష్కే సంపత్, యాదవ్,అడిగొప్పుల రాజు, వెంకన్న,వెంకటస్వామి, కుంబార్ దిగంబర్, మ్యాదగొని అరవింద్,అనిరుధ్ లింగన్న,శ్రీనివాస్,జలందర్,రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, అంజన్న, శ్రావణ్ చక్రపాణి, శివ,మోహన్,మమత, భవాని,కోట తిరుమల,రచన, వీణ సంధ్య,రావుల శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, వివిధ పార్టీల కార్పొరేటర్లు నాయకులు కాసిపేట లింగన్న,దొంత శ్రీనివాస్,కౌటం సతీష్,పాతపెల్లి రవి, దాసరి విజయ్, కంకనాల రాజు,సత్య ప్రసాద్, కొమ్ము వేణు,కందుల సంధ్యారాణి, భాస్కర్ రెడ్డి, పిడుగు కృష్ణ, వాళ్ళాల సురేష్,అంబటి సంతోష్, పీచర శ్రీనివాస్, ధాతు శ్రీనివాస్,అంబటి నరేష్ యాదవ్, దుబాసి మల్లేష్,చల్ల రవీందర్ రెడ్డి,ఇరుగురాల శ్రావణ్,చింటూ బొంతల భాను, మహేష్, చందు,అన్ని పార్టీల నాయకులు యువజన సంఘాలు, ధార్మిక సంస్థలు,వర్తక వాణిజ్య సంఘాల వేలాది మంది హిందు యువత శోభాయాత్రలో పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు ను వెంటనే తొలగించాలి







**హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 01(నేషనలిస్ట్ వాయిస్ ):**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా జనావాసాల మధ్య నెలకొల్పే డంపింగ్ యార్డ్ ప్రాజెక్టు ను వెంటనే రద్దు చేయాలని హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ రంటాల సుహాసిని రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు.

గత పది రోజులుగా హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అఖిల పక్ష వివిధ కుల ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షల కు మద్దతుగా బుధవారం వేలాది మంది ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో అంబేద్కర్ కూడలి చౌరస్తాలో చుట్టూ అర కిలో మీటరు తో పాఠశాలల యాజమాన్యాల వారిచే మానవ హారం నిర్వహించారు .

ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా జనావాసాల మధ్య ప్రాణ కోటికి, అన్నదాతల వ్యవసాయ రంగానికి జల వాయు కాలుష్యముతో నష్టం చేకూర్చే డంపింగ్ యార్డు ప్రాజెక్టు వెంటనే రద్దు చేయాలని పలువురు విద్యార్థినీ విద్యార్థులు డిమాండ్ చేస్తూ నిందించారు. రెండు గంటల సేపు వాహనాలు బారులు దీరి వాహనాల్లో వచ్చిన వారు సైతం ఈ ఆందోళనలకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రోంటాల సుహాసిని మాట్లాడుతూ ఇట్టి డంపింగ్ యార్డ్ ప్రాజెక్టు ను రద్దు చేసే వరకు తాము సైతం ఉద్యమంలో పాల్గొంటున్నామని ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా. హుజురాబాద్ ప్రాంత సమీపంలో సిర్సపల్లి సరిహద్దు వద్ద జనావాసాల మధ్య నెలకొల్పే డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని మన్నించి తక్షణమే డంపింగ్ యార్డు ప్రాజెక్టును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పోలాడి రామారావు హెచ్చరించారు.

# సిద్ధార్థ స్కూల్ లో కరాటే పోటీలు





**కరీంనగర్ ఏప్రిల్ 01(నేషనలిస్ట్ వాయిస్)**

కరీంనగర్‌లోని భగత్‌నగర్ లో ఉన్న సిద్ధార్థ విద్యాసంస్థలో ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలలో సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొని వివిధ స్థాయి బెల్టును సాధించారు. ఈ సందర్భంగా 12 మంది విద్యార్థులు బ్రౌన్ బెల్ట్ సాధించగా, టి. శివప్రియ ఎస్. రిషిక్ బ్లాక్ బెల్ట్ మొదటి డిగ్రీ పొందడం విశేషంగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకట రమణ మాట్లాడుతూ, ముఖ్యంగా అమ్మాయిలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దాసరి స్వప్న శ్రీపాల్, కరాటే మాస్టర్ పుల్లూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

# ఒంటిమిట్టలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

## శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండరాముడు



**ఒంటిమిట్ట,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివధనుర్భంగా లంకారంలో శ్రీ కోదండ రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఇకపోతే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుండి వాహనసేవ వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారి ని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. దాసుడుగా, సఖుడుగా, విసనకఱ్ఱగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామస్వామిని వహించి కదిలే తీరు సందర్శనీయమైనది. 108 దివ్య దేశాలలోనూ గరుడసేవ విశిష్టమైనది. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈఓలు ప్రశాంతి, శివప్రసాద్, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ

**ఒంగోలు,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెంలో మంగళవారం అర్ధరాత్రి రెండు విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ల సామాగ్రి చోరీకి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సీహెచ్ మంగమ్మ, షరీఫ్ పొలాలలో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేశారు. వాటిలో విలువైన రాగి తీగ, ఇంధనం, తదితర సామాగ్రి చోరీ చేసి పరారయ్యారు. ఉదయాన్నే మోటార్లు వేసేందుకు పొలాలకు వెళ్లిన రైతులు చోరీ విషయాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరకుని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాగితీగ కోసమే దొంగలు ఈ పనికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలు

## చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు - మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు

## ఏటా ప్రభుత్వం 150కోట్ల భారం - వెల్లడించిన మంత్రి గొట్టిపాటి



**అమరావతి,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

ఇచ్చిన హామీ మేరకు చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్అన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ప్రభుత్వం రూ.150కోట్లు పైనే భరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ జగన్ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో గాడిలో పెడుతున్నారని మంత్రి అన్నారు. 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో చేనేతలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీ నేటి నుంచి అమల్లోకి రానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేశ్ వారికి ఇచ్చిన హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి చేర్చిందని తెలిపారు. జగన్ చేసిన నష్టాలను సరిదిద్దుతూనే రైతులు, చేనేతలు, ఆక్వా, సెలూన్‌లకు సబ్సిడీలు ఇస్తున్నామని అన్నారు. వినూత్న ఆలోచనలతో సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకుంటున్నామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. చరిత్రలో లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్దఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్ర బాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ సంస్కరణలు ఇంతటితో ఆగేవి కాదని.. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మార్పులు తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులతో సమీక్షించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవడానికి పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజక వర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా.. పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లతో పాటు వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం ఇవ్వాలి. వినియోగదారుల అనుమతితో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

# అదృశ్యమైన మహిళ దారుణ హత్య

## అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**చిత్తూరు,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

పెద్దపంజాని మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ(35) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. చంద్రమ్మ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి మహిళ కోసం గాలించగా.. పలమనేరు రూరల్ మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో చంద్రమ్మ మృతదేహం లభ్యమైంది. నగదు లావాదేవీలు కారణంగా ఈ హత్య జరిగినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది చంద్రమ్మ. పెద్దపంజానిలో టైలరింగ్ పని చేస్తూ చిట్టీల వ్యాపార లావాదేవీలు కొనసాగించేది. చంద్రమ్మ కనబడడం లేదని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో ఆమె హత్య విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రమ్మ హత్య స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

## సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్

## చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు

## ఏకగ్రీవంగా ఆమోదించిన సభ-వైకాపా సభ్యుల వాకౌట్

**న్యూఢిల్లీ,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు.ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

# చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం

## ఉచిత విద్యుత్‌తో తీరనున్న కష్టాలు

## ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్ట్

**అమరావతి,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**



ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా చిన్న చేనేత కుటుంబాలకు ఉపశమనం కలిగించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం చేనేత రంగానికి బలాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత మగ్గాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి వ్యయం తగ్గి, చేనేత కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కలగనుందని నిపుణులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ తన సందేశంలో గతాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. 2017లో నేతన్నలు తమ సమస్యలు వివరించినప్పుడు తనకు తీవ్రంగా బాధ కలిగిందని తెలిపారు. అప్పటినుంచే చేనేత రంగానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నానని, చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించానని చెప్పారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని ఇచ్చిన పిలుపు యువతలో మంచి స్పందన తెచ్చిందని పేర్కొన్నారు. అలాగే నివార్ తుపాను సమయంలో వెంకటగిరి ప్రాంతంలో చేనేత మగ్గాలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూసి బాధపడ్డానని, అప్పుడు ఇచ్చిన భరోసాను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత 21 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ది పొందబోతున్న ప్రతి చేనేత కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం

## ఉచిత విద్యుత్‌తో తీరనున్న కష్టాలు

## ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్ట్


**అమరావతి,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా చిన్న చేనేత కుటుంబాలకు ఉపశమనం కలిగించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం చేనేత రంగానికి బలాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత మగ్గాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి వ్యయం తగ్గి, చేనేత కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కలగనుందని నిపుణులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ తన సందేశంలో గతాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. 2017లో నేతన్నలు తమ సమస్యలు వివరించినప్పుడు తనకు తీవ్రంగా బాధ కలిగిందని తెలిపారు. అప్పటినుంచే చేనేత రంగానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నానని, చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించానని చెప్పారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని ఇచ్చిన పిలుపు యువతలో మంచి స్పందన తెచ్చిందని పేర్కొన్నారు. అలాగే నివార్ తుపాను సమయంలో వెంకటగిరి ప్రాంతంలో చేనేత మగ్గాలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూసి బాధపడ్డానని, అప్పుడు ఇచ్చిన భరోసాను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత 21 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ది పొందబోతున్న ప్రతి చేనేత కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

## రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే- ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు హర్షం



**అమరావతి,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## అమరావతికి చట్టబద్ధత హర్షణీయం

### ప్రధాని మోడీకి హోంమంత్రి అనిత కృతజ్ఞతలు

**విశాఖపట్నం,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు హోంమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది రైతుల త్యాగాలకు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. అమరావతిని అంగుళం కూడా వేరొకరు కదిపే పరిస్థితి లేకుండా కట్టుదిట్టంగా చట్టాలు, శాసనాలతో ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం సొంతమన్నారు.

# ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

## 30వేల మంది టెక్కీల తొలగింపు

## అందులో 12వేమంది భారీతయులు

**న్యూయార్క్,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఏఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

## షరతులు వర్తిస్తాయనన్న ఇరాన్

**టెహ్రాన్,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

అమెరికా– ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

## 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు

## వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

# ఇక అమరావతే ఆంధ్రాకు శాశ్వత రాజధాని

### గత వైకాపా అరచాకంతో రాజధాని లేకుండా పాలన

### ఆనాటి రైతులకు తీవ్ర వేధింపులు..మహిళలపై దాడులు

### లోక్‌సభ చర్చలో ఎంపి పురంధేశ్వరి

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**



ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని భాజపా ఎంపీ పురందేశ్వరి అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ప్రక్రియ అరాచకంగా జరిగిందన్నారు. ఆనాడు చర్చ లేకుండానే రాష్ట్ర విభజన చేశారు. పార్లమెంట్‌లో లైట్లు, కెమెరాలు ఆపి బిల్లు పాస్ చేశారు. చట్టాన్ని గౌరవించి విభజనను ప్రజలు అంగీకరించారు. ఆ తర్వాత ఏపీకి రాజధాని అవసరం వచ్చింది. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పాలన ప్రారంభమైంది. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టింది. రాజధానికి 29వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిచ్చారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడింది. త్యాగం చేసిన రైతుల పట్ల గత ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తించిందని పురందేశ్వరి అన్నారు. వైసీపీ హయాంలో రాజధానిపై తీవ్ర అస్థిరత నెలకొందని.. రాజధానిపై గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. అమరావతి తొలి ప్రజా రాజధానిగా గుర్తింపు తెచ్చుకుందని ఎంపీ తెలిపారు. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టిందని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు ఎంపీ. వైసీపీ వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడిందని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో ఏపీలో అరాచక పాలన సాగిందని విమర్శలు గుప్పించారు. వికేంద్రీకరణ పేరుతో రాష్ట్రాన్ని వైసీపీ నాశనం చేసిందన్నారు. అమరావతి కోసం రాజధాని రైతులు 1600 రోజులకు పైగా ఉద్యమించారని తెలిపారు. రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టిందని మండిపడ్డారు. ఆడవారని కూడా చూడకుండా నానా హింసలు పెట్టారని అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరించలేదన్న కాంగ్రెస్ విమర్శలు సరికాదన్నారు. రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం హడ్కో నిధులు విడుదల చేసిందని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.

# అమరావతి బిల్లును వ్యతిరేకించిన వైసిపి

## లోక్‌సభ నుంచి ఎంపి వాకౌట్

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించటం కోసం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. వైసీపీ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తూ సభనుంచి వాకౌట్ చేశారు. లోక్‌సభలో చర్చ సందర్భంగా వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లుకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయమన్నది రాష్ట్ర ఇష్టమని.. గతంలో హైకోర్టుకు కేంద్రం అఫిడవిట్ ఇచ్చిందని తెలిపారు. ఏపీ సభ్యులు ప్రత్యేక హోదా, పోలవరం నిధులపై మాట్లాడితే బాగుండేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు అమరావతి రైతులకు ప్లాట్లు ఇవ్వలేదని అన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అమరావతిపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.5 వేల కోట్లే ఖర్చు చేసింది. రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడు ఇస్తారో బిల్లులో పెట్టాలి. రాజధాని కోసం వేల ఎకరాలు తీసుకోవాల్సిన అవసరం ఏముంది?. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారు. 50 వేల ఎకరాలు ఉండగా.. మరో 50 వేల ఎకరాలు కావాలంటున్నారు. అదనపు భూసేకరణ ఎందుకు. రాజధాని విషయంలో చంద్రబాబుకు స్పష్టత లేదుని అన్నారు. అందుకే వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# మార్కాపురం బస్సు ప్రమాదం కేసు

## డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి అరెస్ట్

**మార్కాపురం,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్ యువరాజు, బస్సు యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమవగా.. మరో 28 మంది గాయపడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లో శ్రావణి ట్రావెల్స్ నడుపుతున్న యార్లగడ్డ కోటేశ్వరరావు వద్ద ఁఖీ 20 ఆ 0487 నంబర్ బస్సును సెకండ్ హ్యాండ్‌గా కొనుగోలు చేసి హరికృష్ణారెడ్డి నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం సమయంలో బస్సులో సుమారు 35 నుంచి 41 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు యాంత్రిక లోపాలు కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి పరారీలో ఉండగా.. పోలీసులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 28 మంది ప్రయాణికులు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

## బిల్లు తీసుకు రాబోతున్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# మూడుముక్కలాటతో అమరావతికి ద్రోహం

## జగన్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి పెమ్మసాని

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**


అమరావతి అంటే తనకు ఎమోషన్ అని.. అందుకే తెలుగులో మాట్లాడతున్నాని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లోక్‌సభలో అమరావతి బిల్లుపై చర్చలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. బిల్లుపై మాట్లాడటం అమరావతి బిడ్డగా గర్విస్తున్నట్లు తెలిపారు. అమరావతి రైతులకు, మహిళలకు కేంద్రమంత్రి అభినందనలు తెలియజేశారు. రూపాయి ఖర్చు లేకుండా వేల ఎకరాలు అమరావతి కోసం సమీకరించిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబుపై ప్రజలు పెట్టుకున్న నమ్మకమే అమరావతి అని వెల్లడించారు. అధికార వికేంద్రీకరణ పేరుతో వైసీపీ మూడు ముక్కలాట ఆడిందని కేంద్ర మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల విలువైన కాలాన్ని వృథా చేసిందన్నారు. ఏపీకి రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితిని వైసీపీ సృష్టించిందని మండిపడ్డారు. రైతుల కన్నీళ్లే ఈ చట్టానికి పునాదిగా మారాయన్నారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత్వం ఉంటే పెట్టుబడులు రావని తెలిపారు. రాజధాని నిర్ణయం.. మార్పు.. కేంద్రం పరిధిలోనే ఉంటుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాజధాని లేకుండా ఇన్నేళ్లు రాష్ట్రం గడిపిందన్నారు. చంద్రబాబు ప్రతిపాదించిన అమరావతిని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టి మూడుముక్కలాట ఆడిందన్నారు. ఇందువల్ల వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేశారని అన్నారు. ఓ రకంగా ఇది సుదినమని అన్నారు.

# అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

## నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు

## తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1(నేషనలిస్ట్ వాయిస్):**



ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయూత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

# ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

## మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు

## భారత వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు ఊరట

## వారికి కూడా రైతుభరోసాకు ప్రభుత్వం సానుకూలం

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని, కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం, పది రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి.

# జిఎస్టీ వసూళ్లలో 8,8శాతం వృద్ధి

## మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

దేశంలో జిఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

# మంగళ్‌హాట్ గోదాముపై దాడి

## హోటళ్లకు చచ్చిన మేకల మాంసం

## కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

## సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు - కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం

## ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా స్జబెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడు తున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

# మృత్యువులా దూసుకొచ్చిన కారు

## నేడు వివాహ నిశ్చితార్థం..

## అంతలోనే రోడ్డు ప్రమాదం

## ప్రమాదంలో యువకుడు మృతి

**ఖమ్మం,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కొండగట్టు ఆలయంలో అపశృతి

## చలువ పందిళ్లు కూలి

## 15మందికి గాయాలు

**జగిత్యాల,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

# పెరిగిన మీ సేవ చార్జీలు

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

ప్రభుత్వ మీసేవ ఛార్జీలను సవరించారు.నేటి నుండి ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా రూ. 27-00 రూ.ఇరవై ఏడు వరకు పెంచారు.అమలులోకి వచ్చిన కొత్త రేట్ల ప్రకారం. ప్రధాన సర్టిఫికెట్ల జారీ కి రూ.80 చెల్లించాల్సి ఉంటుంది.రీప్రింట్ సహా ఇతర పత్రల కోసం రూ.62 చెల్లించాల్సి ఉంటుంది.విద్యుత్ సహా బిల్లుల చెల్లింపులపై కూడా ఛార్జీలు సవరించారు.మీ సేవ ఛార్జిలను ప్రభుత్వం పెంచడంతో సామాన్య ప్రజలపై భారం పడనుంది.

# నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

## 3వేల మందితో పోలీస్ బందోబస్తు

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

## ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం

## వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷-గ్గ÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

# ఆరు గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

**హైదరాబాద్,ఏప్రిల్1(నేషనలిస్ట్ వాయిస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656